

భూ సమస్యల పరిష్కారానికే..

జిల్లాలో భూభారతి రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. భూ సమస్యలపై రైతులనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

- 13లో ▸



నాణ్యతతో నిర్మించుకోవాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అధికారులు మార్కింగ్ ఇస్తున్నారు. నాణ్యతతో ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచిస్తున్నారు.

- 13లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 37.8 /23.4

వాతావరణం

ఉదయం ఆహ్లాదకర గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణం పొడిగా మారుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నలుగురు పీఎంపీలపై కేసులు



గాంధారి: మండల కేంద్రంలో అర్హతలు లేకున్నా ఆస్పత్రులు నడుపుతూ బెడ్స్ ఏర్పాటు చేసి ఇన్‌పేషెంట్లకు చికిత్సలు చేస్తున్న నలుగురు పీఎంపీలపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. పీఎంపీలు నరేందర్, హేమ్‌సింగ్, అంజయ్య, ఆంజనేయులు రోగులను చేర్పించుకుని చికిత్సలు చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు మెడికల్ కౌన్సిల్ సభ్యులు తనిఖీలు నిర్వహించారన్నారు. వారి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.

‘అధికారులు అప్రమత్తంగా ఉండాలి’



బీబీపేట: వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీపీవో మురళి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పలు కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పంచాయతీలలో ఆయిల్ బాల్స్‌ను సిద్ధం చేసి ఉంచుకోవాలని సూచించారు. అనంతరం మండలకేంద్రంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌజ్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో అబ్బాగౌడ్, కార్యదర్శి రమేష్, కారోబార్ సిద్దరాములు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుతారి రమేష్ తదితరులున్నారు.

ఫర్టిలైజర్ దుకాణాలపై దాడులు



నాగిరెడ్డిపేట: మండలకేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలపై బుధవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో రైతులకు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న విత్తనాలను, స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన, గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలనే విక్రయించాలని దుకాణాదారులకు సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీలలో టాస్క్‌ఫోర్స్ అధికారులు అనిల్‌కుమార్, మహ్మద్ నదీముద్దీన్, ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్, నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి, ఏవో సాయికిరణ్ పాల్గొన్నారు.

బాన్సువాడ బల్దియా నుంచి కొయ్యగుట్ట తండా తొలగింపు



బాన్సువాడ : బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో విలీనమైన కొయ్యగుట్ట తండాను మున్సిపల్ పరిధి నుంచి తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు తెలిపారు. బుధవారం బాన్సువాడ మున్సిపాలిటీ కార్యాలయంలోని నోటీసు బోర్డుపై మున్సిపల్ నుంచి తొలగించిన కొయ్యగుట్ట తండా వివరాలను అతికించారు. మున్సిపల్ చట్టం ప్రకారం బాన్సువాడ మున్సిపాలిటీలోని 2వ వార్డులో ఉన్న కొయ్యగుట్ట తండాను తొలగించినట్లు తెలిపారు. తండా వాసుల నుంచి ఏమైనా అభ్యంతరాలు ఉంటే 11 వ తేదీ వరకు మున్సిపాలిటీలో తెలియజేయాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో 19 వార్డులు ఉన్నాయని, అన్ని వార్డులు అలాగే ఉంటాయని తెలిపారు.

కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

కామారెడ్డి క్రైం: నిజాంసాగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్.మోహన్ సింగ్ అనే కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. విధుల్లో నిర్లక్ష్యం వహించడం, పోలీసు ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించే చర్యలకు పాల్పడడం, అనైతిక ప్రవర్తనలకు సంబంధించిన ఆరోపణలు రావడంతో విచారించి ఈ చర్య తీసుకున్నారు. ఈ మేరకు ఎస్పీ రాజేష్ చంద్ర బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనైతిక చర్యలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

తనఖా పెట్టేస్తున్నారు



అవసరానికి డబ్బులు సర్దుబాటు కాక చాలామంది ఇబ్బందులు పడుతుంటారు. అలాంటివారిని గోల్డ్‌లోన్స్ ఆకర్షిస్తున్నాయి. బ్యాంకులతో పాటు పలు సంస్థలు బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టుకుని సులువుగా రుణాలు ఇస్తుండడంతో అందరూ అటువైపు వెళుతున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన రైతులు సహకార బ్యాంకుల్లోనే సుమారు రూ. 400 కోట్ల విలువైన గోల్డ్ లోన్స్ తీసుకోవడం గమనార్హం. ఇతర బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల్లోనూ బంగారాన్ని తనఖా పెట్టి భారీగానే అప్పులు తీసుకున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

- అవసరానికి గోల్డ్ లోన్!
- సహకార బ్యాంకులకు వరుస కడుతున్న రైతులు
- ఉమ్మడి జిల్లాలో రూ. 400 కోట్ల మేర అప్పులు
- వాణిజ్య, కార్పొరేట్ బ్యాంకుల్లోనూ భారీగానే రుణాలు..

వ్యవసాయ పెట్టుబడుల కోసమో.. పిల్లల చదువుల కోసమో.. ఇతర అవసరాల కోసమో ప్రజలు అప్పులపైనే ఆధారపడాల్సి వస్తోంది. వ్యాపారులు అధిక వడ్డీ వసూలు చేస్తుండడంతో ప్రత్యామ్నాయాలవైపు చూస్తున్నారు. ఇటీవల కొన్నేళ్లుగా చాలామంది రైతులు బ్యాంకులకు వెళ్లి బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రుణాలు తీసుకుంటున్నారు. బ్యాంకుకు వెళ్లిన కొద్దిసేపట్లోనే సులువుగా పని జరిగిపోతోంది. దీంతో అవసరానికి ఆభరణాలు తాకట్టు పెట్టి రుణం పొందుతున్నారు. డబ్బులు సర్దుబాటు అయిన తరువాత తిరిగి వడ్డీతో చెల్లించి ఆభరణాలను వెనక్కి తెచ్చుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎన్‌డీసీసీబీ(సహకారం బ్యాంకు) నుంచి బంగారం రుణాలు రూ.400 కోట్లకుపైగా ఇచ్చినట్టు ఇటీవల బ్యాంకు ఉన్నతాధికారులు ప్రకటించారు. సహకార బ్యాంకులతో ఎక్కువగా రైతులకే సంబంధాలుంటాయి. రైతులు క్రాప్‌లోన్స్‌తో పాటు దీర్ఘకాలిక రుణాలు కూడా తీసుకుంటుంటారు. 8.5 శాతం వడ్డీతో బ్యాంకులో రుణం సులువుగా లభిస్తుండడంతో చాలా మంది సహకార బ్యాంకులకు వరుస కడుతున్నారని తెలుస్తోంది.

బయట అప్పు పుట్టక..

గతంలో గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపారులు రైతులకు అప్పులు ఇచ్చేవారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు, ఇతర అవసరాలకు కూడా వ్యాపారులు అప్పు ఇచ్చేవారు. పంట చేతికి అందిన తరువాత అదే వ్యాపారి పంట ఉత్పత్తులు కొనుగోలు చేసి తనకు రావలసిన అప్పు పోను మిగతా సొమ్ము రైతుకు చెల్లించేవారు. అయితే చాలాచోట్ల వడ్డీ వ్యాపారం తగ్గిపోయింది. తరువాతి కాలంలో ఫైనాన్స్‌లు వచ్చినా అవి అడ్డగోలు వడ్డీలు వసూలు చేయడంతో పోలీసులకు ఫిర్యాదులు వెళ్లాయి. అనుమతి లేని ఫైనాన్స్‌లపై పోలీసులు దాడులు చేయడం, కేసులు పెట్టడంతో చాలాచోట్ల ప్రైవేట్ ఫైనాన్స్‌లు కనుమరుగయ్యాయి. ఇప్పుడు మార్కెట్‌లో సామాన్యుడికి అప్పు పుట్టే పరిస్థితి లేకుండాపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్యులకు బంగారం తాకట్టు రుణాలు ఉపశమనం కలిగిస్తున్నాయి.

నాణ్యత పరిశీలించి...

బ్యాంకుల్లో బంగారం కుదువ పెట్టి రుణాలు ఇవ్వడానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. బ్యాంకులో ఖాతా ఉండి, అవసరమైన డాక్యుమెంట్స్ చూపితే చాలు బ్యాంకర్లు ఇట్టే బంగారం తనఖా రుణాలు ఇస్తున్నారు. బ్యాంకుకు వెళ్లగానే తీసుకువెళ్లిన బంగారు ఆభరణాల నాణ్యతను పరిశీలించి, ఎంత మేర అప్పు ఇవ్వవచ్చో గోల్డ్ అప్రైజర్ లెక్కలు వేస్తారు. దాని ఆధారంగా రుణం మంజూరవుతుంది. పది గ్రాముల బంగారు ఆభరణానికి తక్కువలో తక్కువ రూ.65 వేల మేర రుణం ఇస్తున్నారు. దీంతో డబ్బులు అవసరం ఉన్న వారు ప్రైవేట్ ఫైనాన్స్‌లకు కాకుండా బ్యాంకులకు వెళ్లి గోల్డ్ లోన్ తీసుకుంటున్నారు. ఏ బ్యాంకుకు వెళ్లినా ఓ గంటలో పని పూర్తయి ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయి. దీంతో డబ్బులు అవసరం ఉంటే మెడలో ఉన్న గొలుసు, చేతికి ఉన్న ఉంగరాలు తీసుకువెళ్లి అప్పు తీసుకుంటున్నారు. ఎవరి పైరవీ లేకుండా, ఇతర వృథా ఖర్చులు లేకుండా రుణం లభిస్తుండడంతో బ్యాంకుల్లో గోల్డ్ లోన్‌లకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని బ్యాంకులకు సంబంధించి బ్రాంచీలలో రోజూ పదికిపైగా గోల్డ్ లోన్ ఫైళ్లు సిద్ధం చేస్తున్నారు. గతంలో గోల్డ్ లోన్స్‌కు పట్టణాలు, నగరాల్లోనే సౌకర్యం ఉండేది. ఇప్పుడు మారుమూల గ్రామాల్లో ఉన్న బ్యాంకుల్లో సైతం గోల్డ్‌లోన్స్ ఇస్తున్నారు. బంగారం ధర పెరిగిన కొద్దీ రుణ పరిమితి పెంచుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో బంగారం ధర రూ. 97 వేలు ఉండగా, ఆభరణాలపై రూ.65 వేల వరకు రుణం ఇస్తున్నారు.

డ్రమ్ము చెప్పే కన్నీటి కథ



అశోక్‌నగర్ కాలనీలో డ్రమ్ములలో నీటిని పట్టుకుంటున్న ప్రజలు

- జిల్లాకేంద్రంలో తీవ్ర నీటి సమస్య
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

కామారెడ్డి టౌన్: జిల్లాకేంద్రంలోని పలు కాలనీలలో తీవ్ర నీటి కొరత నెలకొంది. ప్రధానంగా అశోక్‌నగర్ కాలనీలో నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండాకాలం వచ్చిందంటే అశోక్‌నగర్ కాలనీలోని బోర్లు ఎత్తిపోతాయి. దీంతో నీటి సమస్య ఏర్పడుతుంది. 11 వందల ఫీట్ల మేర బోరుబావులు తవ్వించినా చుక్క నీరు రావడం లేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. బోర్లు ఎత్తిపోతుండడంతో కాలనీవాసులు వాటర్ ట్యాంకర్లపైనే ఆధారపడుతుంటారు. ట్యాంకర్ ఎప్పుడొస్తుందా అని కాలనీవాసులు ఎదురు చూస్తుంటారు. ఇళ్ల ముందు రోడ్డు పక్కన డ్రమ్ములు పెట్టుకుని నిరీక్షిస్తూ ఉంటారు. వేసవిలో నీటి కొరత కారణంగా ఆ కాలనీలో ఏ ఇంటి ముందు చూసినా నీటి డ్రమ్ములు కనిపిస్తాయి. ట్యాంకర్ రాగానే డ్రమ్ములలో నీరు నింపుకుంటారు. తర్వాత ఆ నీటిని తిరిగి ఇళ్లలోకి మోసుకువెళ్తారు. అశోక్‌నగర్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న క‘న్నీటి’ కష్టాలను ‘సాక్షి’ తన కెమెరాలో బంధించింది. పాలకులు స్పందించి నీటి సమస్యకు త్వరగా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు



భిక్కనూరు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: పశువుల అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. ఇందుకోసం జిల్లాలో ఏడోచోట్ల సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మాచారెడ్డి మండలంలోని ఘన్‌పూర్, భిక్కనూరు మండలంలోని టోల్‌ప్లాజా, బస్వాపూర్ చెక్‌పోస్టులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పశువుల అక్రమ రవాణాపై నిరంతరం నిఘా పెట్టాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. ఎవరు చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే, ద్వేషపూరితమైన పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని ప్రజలకు సూచించారు.

సకాలంలో రుణాలు అందించాలి



వార్షిక ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ చందర్, అధికారులు

- బ్యాంకర్లతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- రూ. 8,204.51 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక ఖరారు


కామారెడ్డి క్రైం: పంట రుణాలు, విద్య, బ్యాంకు లింకేజీ, మహిళ, శ్రీనిధి, స్వయం ఉపాధి రుణాలను సకాలంలో మంజూరు చేసి జిల్లా ఆర్థిక అభివృద్ధిలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బ్యాంకులు, సంక్షేమ శాఖల వారీగా స్వయం ఉపాధి, ఎస్‌హెచ్‌జీ, వ్యవసాయ, తదితర రుణాల లక్ష్యాలు, ప్రగతిపై బుధవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీఆర్‌డీఏ మహిళా స్వయం సహాయక సంఘాల రుణాల లక్ష్యాలను సకాలంలో సాధించాలన్నారు. అలాగే బకాయిలను త్వరగా వసూలు చేయాలన్నారు. జిల్లా పారిశ్రామిక కేంద్రం ద్వారా అందజేసే రుణాల వివరాలపై యువతకు అవగాహన కల్పిస్తూ వివిధ బ్యాంకులలో పెండింగ్‌లో ఉన్న రుణాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న రుణాలను త్వరగా మంజూరు చేసేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా రూ. 8,204.51 కోట్లతో వార్షిక ప్రణాళికను విడుదల చేశారు. ప్రాధాన్యత రంగానికి రూ. 6,993.58 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ. 1,210.93 కోట్లు కేటాయించారు. ఇందులో రూ. 5,666.20 కోట్లతో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారు. ఎంఎస్‌ఎంఈ లకు రూ. 1,102 కోట్లు, గృహ నిర్మాణానికి రూ. 155.52 కోట్లు, మౌలిక సదుపాయాలకు రూ. 21.81 కోట్లు, సంప్రదాయ ఇంధనానికి రూ. 4.05 కోట్లు, ఇతర రంగాలకు రూ.4 కోట్లు కేటాయించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చందర్ నాయక్, ఎల్‌డీఎం చంద్రశేఖర్, నాబార్డ్ డీడీఎం ప్రవీణ్, ఆర్‌బీఐ ఏజీఎం రెహమాన్, డీఆర్డీవో ఏపీడీ మురళీకృష్ణ, బ్యాంకర్లు పాల్గొన్నారు.

ఆశ.. నిరాశేనా?

- నాలుగు ఎకరాల వరకే అందిన పెట్టుబడి సాయం
- జిల్లాలో మరో 56 వేల మందికి అందని యాసంగి రైతు భరోసా
- నిరాశలో లబ్ధికి దూరమైన రైతులు

తమ మొదటి ప్రాధాన్యత రైతు సంక్షేమమేనని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఆయా పథకాల అమలులో మాత్రం రైతులకు నిరాశనే మిగులుస్తోంది. పంట రుణాల మాఫీతోపాటు రైతుభరోసా నిధుల విడుదల విషయంలోనూ జిల్లాలో వేలాది మంది రైతులకు మొండిచేయి చూపింది. ఖరీఫ్ సాగు పనులు ప్రారంభమవుతున్నా.. ఇప్పటికీ జిల్లాలో సుమారు 56 వేల మందికి యాసంగి పెట్టుబడి సాయం అందలేదు. వారంతా సర్కారు సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

– కామారెడ్డి క్రైం



రైతులకు పంటల పెట్టుబడి విషయంలో అండగా నిలవాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం 2018 లో రైతుబంధు పథకాన్ని తీసుకువచ్చింది. ఏటా రెండు వ్యవసాయ సీజన్లలో పెట్టుబడి సాయం అందించారు. మొదట్లో సీజన్‌కు ఎకరానికి రూ. 4 వేల చొప్పున రైతుబంధు ఇచ్చారు. ఆ తర్వాత దానిని రూ. 5 వేలకు పెంచారు. తాము అధికారంలోకి వస్తే ఏటా ఎకరానికి రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించింది. అధికారంలోకి వచ్చాక రైతుబంధులో అనేక లోపాలు ఉన్నాయని, సాగుకు యోగ్యం కాని భూములకూ రైతుబంధు ఇచ్చారని చెబుతూ అనర్హులను ఏరివేసేందుకు ఓ కమిటీ వేసింది. అధికార యంత్రాంగం ద్వారా సాగుకు యోగ్యం కాని భూముల లెక్కలు తీశారు. రైతుబంధు పేరును రైతు భరోసాగా మార్చారు. అంతా పూర్తయ్యాక ప్రభుత్వం నిధుల కొరత కారణంగా ఎకరానికి సీజన్‌కు రూ.6 వేలు మాత్రమే ఇస్తామని ప్రకటించారు. మార్చి 31 వరకల్లా వంద శాతం రైతు భరోసా నిధులు జమ చేస్తామన్నారు. కానీ ఇప్పటివరకు నాలుగెకరాల లోపు భూమి ఉన్న రైతులకే పెట్టుబడి సాయం అందింది. మార్చి నెలాఖరు తర్వాత ఒక్క రైతుకూ పెట్టుబడి సాయం అందించలేదు.

ఇస్తారో.. లేదో?

రైతు భరోసా నిధుల జమ ప్రక్రియ జనవరి 26 న ప్రారంభమైంది. అప్పటి లెక్కల ప్రకారం జిల్లాకు సంబంధించి మొత్తం 3,25,713 మంది రైతులకుగాను రూ.315.31 కోట్ల నిధులు అవసరం. మార్చి నెలాఖరు వరకు 2,70,149 మంది రైతుల ఖాతాలలో రూ. 215.98 కోట్లు జమ చేశారు. మిగిలిన సుమారు 56 వేల మందికి సంబంధించి రూ. 100 కోట్ల నిధులు విడుదల కావాల్సి ఉంది. యాసంగి సీజన్ ముగిసిపోయి ఖరీఫ్ పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఇప్పటికీ మిగిలిన రైతులకు రైతు భరోసా అందిస్తారా లేదా అన్న విషయమై స్పష్టత లేదు. దీంతో వారంతా నిరాశకు గురవుతున్నారు. సర్కారు తీరుపై ఆగ్రహంతో ఉన్నారు. గురువారం నిర్వహించే క్యాబినెట్ మీటింగ్‌పై ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి ఆంక్షలు లేకుండా అర్హులందరికీ పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

ట్రాన్స్‌కోలో ఇన్‌చార్జీల పాలన



నిజాంసాగర్‌లో ఖాళీగా ఉన్న ఏఈ కుర్చీ

- పలు ఏఈలు, ఏడీలు, డీఈ పోస్టులు ఖాళీ..
- ఇబ్బందిపడుతున్న వినియోగదారులు

నిజాంసాగర్: ట్రాన్స్‌కోలో పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏఈలు, డీఈలు, ఏడీ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్నారు. దీంతో సకాలంలో సేవలందక వినియోగదారులు ఇబ్బందిపడుతున్నారు.

విద్యుత్ శాఖలో జిల్లావ్యాప్తంగా 10 ఏఈ పోస్టులు, నాలుగు ఏడీ పోస్టులు, ఒక డీఈ పోస్టు ఖాళీగా ఉన్నాయి. జుక్కల్ నియోజకవర్గంలో నిజాంసాగర్, పిట్లం, పెద్దకొడప్‌గల్ ఏఈ పోస్టులు, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డిటౌన్, బాన్సువాడ నియోజకవర్గంలో నస్రుల్లాబాద్, బీర్కూర్, కామారెడ్డి నియోజకవర్గంలో దోమకొండ, సర్వాపూర్, కామారెడ్డి టౌన్ ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే పిట్లం, బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి టౌన్ ఏడీ పోస్టులు, బాన్సువాడ డివిజన్ డీఈ పోస్టు ఖాళీగా ఉంటున్నాయి. ఆయా స్థానాలలో ఇన్‌చార్జీలతో పాలన సాగుతోంది. దీంతో వినియోగదారులకు సకాలంలో సేవలందడం లేదు. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభమవుతుండడంతో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు డిమాండ్ ఉంటుంది. అంతేకాకుండా గ్రామాల వారీగా కరెంట్ సమస్యలు కూడా ఎక్కువవుతాయి. అధికారుల పోస్టులను భర్తీ చేసి, కరెంట్ సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం

మండలాలవారీగా ఖాళీగా ఉన్న ఏఈ పోస్టులతో పాటు ఏడీలు, డీఈ పోస్టులను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాం. ప్రభుత్వం భర్తీ ప్రక్రియ చేపడితే సమస్య పరిష్కారం అవుతుంది. అప్పటి వరకు ఇన్‌చార్జిలతో సేవలు కొనసాగిస్తాం. సమస్యలను వేగంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రావణ్‌కుమార్, ఎస్‌ఈ, కామారెడ్డి

డీసీసీబీ సేవలకు ఐఎస్‌వో గుర్తింపు



ఐఎస్‌వో సర్టిఫికెట్ అందుకుంటున్న డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ: జిల్లాకేంద్రంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కస్టమర్లకు అందిస్తున్న సేవలకు గాను ఐఎస్‌వో ధ్రువీకరణ పత్రం అందజేసినట్లు చైర్మన్ రమేశ్‌రెడ్డి తెలిపారు. జిల్లాకేంద్రంలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో బుధవారం పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ డీసీసీబీ అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తున్నందుకు, బ్యాంకు నిర్వహణ, ఖాతాదారులకు బ్యాంకు ద్వారా అందిస్తున్న విలువైన సేవలకు గాను ఐఎస్‌వో ధ్రువీకరణ పత్రం (9001 : 2015) జారీ చేసిందన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి నిర్వహించిన ఆడిట్‌లో బ్యాంకు మంచి ఆర్థిక ఫలితాలు సాధించి, అన్ని విభాగాల్లో మెరుగైనట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆడిట్ స్కోర్ 90 సాధించామని, ఇది బ్యాంకు చరిత్రలో మొదటిసారని పేర్కొన్నారు. ఈ ఘనత సాధించేందుకు సహకరించిన ఖాతాదారులకు, రైతులకు, సహకార సంఘాలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. డీసీసీబీ డైరెక్టర్లు, సీఈవో నాగభూషణం, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంజీరలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పిట్లం(జుక్కల్): మండలంలోని మద్దెలచె ర్వు గ్రామ శివారులో ని మంజీరా నదిలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్సై రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడికి సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయసు ఉంటుందని, ఒంటిపై తెలుపు రంగు అంగీ, తెలుపు రంగు ధోవతి ఉందని, 2 నుంచి 4 రోజుల క్రితం చనిపోయినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 8712686171, 8712686170 నంబర్లకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని బురుజు సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో నాగంవార్ వినోద్‌కు చెందిన ఇల్లు పూర్తిగా కాలిపోయింది. దేవునిగదిలో షార్ట్‌సర్క్యూట్ జరగడంతోనే అగ్నిప్రమాదం సంభవించినట్లు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. తల్లిదండ్రులు పెళ్లి వేడుకకు వెళ్లగా ఇంట్లో కేవలం వినోద్, అతని భార్య, పిల్లలు పడుకున్నారు. రాత్రి రెండు గంటల సమయంలో పెద్ద శబ్దం రావడంతో లేచి చూసే సరికి ఇంట్లోని దూలాలు, వాసాలకు నిప్పంటుకొని దట్టమైన మంటలు వ్యాపించాయన్నారు. వెంటనే భార్యాపిల్లలతో బయటకు వచ్చామన్నారు. ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారని తెలిపారు. ప్రమాదంలో రూ. 90 వేల నగదు, 30 గ్రాముల బంగారం కాలిపోయిందని, సుమారు రూ.8 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. ఆర్ఐ శంకర్ , రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

ఆపదలో ఆపన్నహస్తం సీఎం రిలీఫ్ ఫండ్

బాన్సువాడ రూరల్: అనారోగ్యానికి గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల పాలిట సీఎం రిలీఫ్‌ఫండ్ ఆపన్నహస్తంగా నిలుస్తోందని బోర్లం మాజీ ఎంపీటీసీ శ్రావణీ దేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రామానికి చెందిన రఫత్‌ఖాన్‌కు మంజూరైన మంజూరైన రూ.28వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు.

ఆర్సీబీ టీం టైటిల్ గెలవడంతో మద్నూర్‌లో ఫ్రీగా పానిపూరి



మద్నూర్(జుక్కల్): ఐపీఎల్ 2025 టైటిల్‌ను ఆర్సీబీ టీం గెలిచిన విషయం తెలిసిందే. ఆర్సీబీ టీం టైటిల్ గెలిచిన సందర్భంగా మద్నూర్ మండల కేంద్రంలో పానిపూరీ వ్యాపారి మెంగావార్ నరేశ్ ఫ్రీగా కట్‌లెట్, పానిపూరి పంచిపెట్టాడు. దీంతో యువకులు, గ్రామస్తులు పానిపూరి బండి వద్ద బారులు తీరారు.

కంపోస్టు ఎరువులు తయారు చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): కంపోస్టు ఎరువులు తయారు చేసుకోవాలని గ్రామ పంచాయితీ సిబ్బందికి ఎంపీవో మలహరి సూచించారు. బుధవారం ఆయన మండలంలోని రాంపూర్ గ్రామ శివారులోని కంపోస్టు షెడ్డును పరిశీలించారు.ప్రతి రోజు తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి కంపోస్టు ఎరువు తయారు చేయాలని కార్యదర్శికి సూచించారు.గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లు, పారిశుధ్య పనులను, నర్సరీ, పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి ఉన్నారు.

బోరుబావుల రైతుల ముందుచూపు

- మద్నూర్ మండలంలో రెండు పంటలతో లబ్ధి పొందాలని పత్తి సాగు ప్రారంభం
- ప్రభుత్వమే విత్తనాలను అందించాలని డిమాండ్
- ప్రైవేటు మార్కెట్‌లో పలు రకాల పత్తి విత్తనాలు



అంతాపూర్‌లో పత్తి విత్తనాలు విత్తుతున్న రైతులు

రైతులు తీసుకొచ్చిన పత్తి విత్తనాలు

మద్నూర్(జుక్కల్): మద్నూర్ మండలంలో బోరుబావుల రైతులు రెండు పంటలు తీసి లాభాలు పొందాలనే ఉద్దేశ్యంతో పత్తి విత్తనాలు సాగు ప్రారంభించారు. జిల్లాలో మద్నూర్‌లోనే సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు, మద్దతు ధర ఉంది. దీంతో రైతులు పత్తి పంట వైపే మొగ్గు చూపుతున్నారు. ఈ సారి వర్షాలు త్వరగానే మొదలవుతాయని బోరుబావుల రైతులు పత్తి పంట విత్తనాలు వేయడం మొదలు పెట్టారు. మండలంలోని పెద్ద తడ్గూర్, అంతాపూర్, సోమూర్, దన్నూర్ తదతర గ్రామాల శివారులో రైతులు పత్తి విత్తనాలను విత్తుకోవడంలో బిజీగా మారారు. పత్తి సంవత్సరం పంట అని, ముందుగా వేయడంతో రెండు పంటలు తీసుకునే అవకాశం ఉందని రైతులు తెలిపారు. జిల్లాలో గతేడాది 33,657 ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా ఈ సారి పంట విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. కాగా, గతేడాది పత్తిసాగు రైతులకు సిరులు కురిపించింది. పత్తి పంటకు ప్రభుత్వం మద్దతు రూ. 589 పెంచుతూ క్వింటాలుకు రూ. 8110 మద్దతు ధర ప్రకటించింది.

విత్తనాల ఎంపికలో అయోమయం

మార్కెట్‌లో ఎన్నో రకాల కంపెనీలకు చెందిన పత్తి విత్తనాలను వ్యాపారులు అందుబాటులో ఉంచారు. సీజన్ ప్రారంభం కావడంతో రైతులు దుకాణదారులు చెప్పిన పత్తి విత్తనాలనే కొనుగోలు చేస్తున్నారు. కొందరు వ్యాపారులు నాణ్యత లేని విత్తనాలు అంటగడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం పత్తి విత్తనాలు అందిస్తే ఇబ్బందులు తప్పుతాయని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ముందే పత్తి పంట వేశాను



వర్షాలు కురియగానే పత్తి పంట వేశాను. బోరుబావులు ఉండడంతో పత్తికి తడులు అందించవచ్చు. రెండు పంటలు తీయాలని పత్తి పంట విత్తులు ముందే మొదలుపెట్టాం. ఇప్పుడు వేసిన పత్తి నవంబర్‌లో పూర్తి కాగా అనంతరం ఇతర పంటలు వేసుకునే అవకాశం ఉంటుంది. ఆరు ఎకరాల్లో పత్తి పంట వేశాను.

– ముష్తాజ్, పత్తి రైతు, అంతాపూర్

విత్తనాలను ప్రభుత్వమే అందించాలి



పత్తి విత్తనాలను ప్రభుత్వమే అందించాలి. బహిరంగ మార్కెట్‌లో ఎన్నో రకాల పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారు. ఏ విత్తనాలు అధిక దిగుబడి ఇస్తుందో తెలియని పరిస్థితి ఉంది. వ్యాపారులు సూచించిన పత్తి విత్తనాలు తీసుకొచ్చి విత్తుకున్నాను. వ్యవసాయ అధికారులు విత్తనాల ఎంపికపై సలహాలు అందించాలి.

– రాములు, పత్తి రైతు, అంతాపూర్

నాణ్యమైన విత్తనాలు ముఖ్యం



లైసెన్స్‌లు కలిగిన దుకాణాల్లో మాత్రమే రైతులు విత్తనాలు తీసుకోవాలి. ప్రభుత్వం పత్తి విత్తనాలను అందించదు. బయట మార్కెట్‌లో విత్తనాలు తీసుకోని రిసిప్ట్ కచ్చితంగా తీసుకోవాలి. చాలా చోట్ల బోరుబావుల కింద పత్తి విత్తడం రైతులు ప్రారంభించారు. ఈ సారి పత్తి విస్తీర్ణం పెరిగి అవకాశం ఉంది.

–రాజు, ఏవో, మద్నూర్

బక్రీద్ పండగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్‌రావు



మద్నూర్‌లో మాట్లాడుతున్న సీఐ

ఎల్లారెడ్డిరూరల్: బక్రీద్ పండగకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బక్రీద్ పండగ సందర్భంగా పట్టణంలోని ఈద్గా వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా తగిన చర్యలను తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేశ్, మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్, గిర్దావార్ శ్రీనివాస్, ఎంపీడీవో ప్రకాష్, విద్యుత్ సిబ్బంది సిద్దార్థరెడ్డి తదితరులున్నారు.

ప్రశాంతంగా పండుగలు నిర్వహించుకోవాలి

మద్నూర్(జుక్కల్): రానున్న పండుగలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని బిచ్కుంద సీఐ నరేశ్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బుధవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. బక్రీద్ పండుగ సందర్భంగా అందరూ కలిసి మెలసి శాంతియుతంగా జరుపుకోవాలని ఆయన అన్నారు. ఆయనతో పాటు ఎస్సై విజయ్ కోండ, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాచారెడ్డి: ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మాచారెడ్డి ఎస్ఐ అనిల్ సూచించారు. ఈమేరకు పాల్వంచ మండలం భవానిపేట గ్రామంలో గ్రామస్తులు ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోరీలు చైన్ స్నాచింగ్ కిడ్నాప్ లు జరగకుండా ఉండాలంటే తప్పనిసరి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింలు రమేశ్‌గౌడ్, సమర సింహారెడ్డి, పరశురాంగౌడ్ తదితరులున్నారు.

వాహనాల తనిఖీ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ముస్తాపూర్ గ్రామ శివారులో బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలపై పెండింగ్ ఉన్న చాలన్‌లను చెల్లించాలని సూచించారు. లేదంటే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనాల ధ్రువపత్రాలు లేనివారికి, హెల్మెట్ ధరించని పలువురికి జరిమానాలు విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై ప్రకాష్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

భిక్కనూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సత్తాచాటాలని ప్రభుత్వ సలహదారు షబ్బీర్‌అలీ అన్నారు.

బుధవారం పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి ఆధ్వర్యంలో భిక్కనూరు, దోమకొండ మండల కాంగ్రెస్‌నేతలు ఏఐసీసీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యుడిగా నియమితులైన షబ్బీర్‌అలీని సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య,నేతలు అనంత్‌రెడ్డి, తిర్మల్‌గౌడ్, స్వామి లింబాద్రి, దుంపల మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కన్‌కల్ గ్రామానికి చెందిన కురుమ మల్లేశ్ (52)ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మురళి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మల్లేశ్ తన ముగ్గురి కూతుళ్ల పెళ్లి చేయడమే కాకుండా తన వ్యవసాయ భూమి పక్కన ఇతరుల నుంచి కొంత భూమిని కొనుగోలు చేశాడు. అప్పులపాలు కావడంతో జీవితంపై విరక్తితో మల్లేశ్ మంగళవారం గ్రామశివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటి నుంచి వెళ్లిన మల్లేశ్ రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో మంగళవారం రాత్రి కులస్తుల సహకారంతో గ్రామ శివారులో వెతకగా ఓ చెట్టుకు శవమై కనిపించాడన్నారు. భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

తహసీల్దార్‌కు గాయాలు

- కారును ఢీకొన్న డీసీఎం వ్యాన్



ప్రమాదంలో ధ్వంసమైన కారు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని అంజనీ చౌరస్తా సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. జుక్కల్ తహసీల్దార్ మహేందర్ కుమార్ పిట్లం నుంచి తన కారులో జుక్కల్‌కు వెళ్తుండగా పెద్దకొడప్‌గల్ మండలంలోని అంజనీ చౌరస్తా సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం వ్యాన్.. కారును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న తహసీల్దార్ మహేందర్‌కుమార్, డీసీఎం డ్రైవర్ ఖలీద్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తహసీల్దార్‌ను హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. రెవెన్యూ సిబ్బంది నాగునాథ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బంగారంతో పరారైన వర్కర్

ఖలీల్‌వాడి: ఆభరణాల తయారీకి ఇచ్చిన 15 తులాల బంగారం తీసుకొని ఓ వర్కర్ పరారైన ఘటన నగరంలోని ఒకటో టౌన్‌లో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కలకత్తాకు చెందిన మహమ్మద్ మజిల్ పదేళ్లుగా నగరంలో గోల్డ్ పనులు చేస్తున్నాడు. అతని వద్ద కలకత్తా నుంచి బాబాన్ హాల్దర్ నాలుగేళ్లుగా ఆభరణాల తయారీ పనులు చేస్తున్నాడు. పనిలో భాగంగా మహమ్మద్ మజిల్ ఇచ్చిన 15 తులాల బంగారం తీసుకొని హాల్దర్ పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పోక్సో కేసు నమోదు

నిజామాబాద్ రూరల్: మోపాల్ మండలంలోని ఒక గ్రామంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి సీఐ సతీశ్ తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి బాలికపై బాలుడు అత్యాచారం యత్నానికి పాల్పడినట్లు స్థానికులు వివరించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సదాశివనగర్: మండల కేంద్రంలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కుర్మ గంగమల్లు(39) నాలుగేళ్ల క్రితం బతుకుదెరువు కోసం విదేశాలకు వెళ్లి తిరిగొచ్చాడు. తనకున్న ఎకరం 30 గుంటల భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల తన భూమిని ప్రైవేట్ సర్వేయర్‌తో సర్వే చేయించగా మూడు గుంటల భూమి తక్కువ వచ్చింది. దీంతో మనస్తాపం చెందిన గంగమల్లు మంగళవారం బావి వద్ద గడ్డిమందును సేవించి, ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. అపస్మారక స్థితిలో ఉన్న గంగమల్లును మొదట కామారెడ్డి ఆస్పత్రికి, తర్వాత ఎల్లారెడ్డిపేట్ అశ్విని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చోరీ జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కిరణ్

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని యోగేశ్వర కాలనీలో తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన సీతాపవర్ అమరనాథ్ కుటుంబసభ్యులతో కలిసి గత నెల 31న హైదరాబాద్‌కు వెళ్లారు. బుధవారం తిరిగి ఇంటికి వచ్చి చూస్తే తాళం పగులగొట్టి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. 12 గ్రాముల బంగారం, రూ.11 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

నిజామాబాద్ రూరల్: మోపాల్ మండలం సిర్‌పూర్ శివారులో ఉన్న బాలయోగి అవధూత నిర్మలానంద స్వామి ఆశ్రమంలోని కుటీరం దగ్ధంపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ బుధవారం పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అర్గుల్ రాజారాం (గుత్ప) ఎత్తిపోతల పథకం

మీకు తెలుసా?



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌ను ఎత్తిపోతల పథకం ద్వారా మళ్లించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.204 కోట్ల వ్యయంతో నిర్మాణం పనులు చేపట్టి పూర్తి చేయించారు.

- 2008 మార్చి 18న వైఎస్సార్ స్వహస్తాలతో అర్గుల్ రాజారాం (గుత్ప) ఎత్తిపోతల పథకంగా నామకరణం చేసి ప్రారంభించారు.
- ఆర్మూర్ ప్రాంత బీసీ నాయకుడు, మాజీ మంత్రి అర్గుల్ రాజారాంకు ఇచ్చిన అరుదైన గౌరవం ఇది.
- ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల పరిధిలోని మాక్లూర్, నందిపేట్, ఆర్మూర్, బాల్కొండ, వేల్పూర్, జక్రాన్‌పల్లి మండలాల్లోని 53 గ్రామాల్లో 38 వేల 792 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ అయింది.
- నందిపేట మండలం ఉమ్మెడ శివారులో నిర్మించిన ఎత్తిపోతల పథకం ద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్‌లోని గోదావరి నదీ జలాలు 22.5 కిలోమీటర్ల దూరం ప్రయాణించి గుత్ప చెరువు మీదుగా ఆర్మూర్ ప్రాంత వ్యవసాయ భూములకు అందుతుండటంతో రైతులు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

– ఆర్మూర్

ఆధ్యాత్మికం

మార్కండేయ ఆలయ ఉత్సవాల్లో పాల్గొన్న మాధవానంద సరస్వతి



దేవతామూర్తులకు ఫలాధివాసం చేస్తున్న వేదపండితులు

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని సిరిసిల్ల రోడ్డులో గల మార్కండేయస్వామి యంత్ర స్థిర ప్రతిష్ఠ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం తోగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. హోమం, దేవతామూర్తుల ఫలాధి, ధాన్యధి, జలాధివాసం కార్యక్రమాన్ని వేదపండితులు చేశారు. పద్మశాలి జిల్లా, పట్టణ నాయకులతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల రాక

గురువారం నిర్వహించే కార్యక్రమాలకు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ హాజరు కానున్నట్లు పద్మశాలి సంఘం నాయకులు పేర్కొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

సిరిసిల్లరోడ్డులోని శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, అయ్యప్ప అన్నప్రసాద సేవా సమితి ప్రతినిధులు గోనే శ్రీనివాస్, పి.రమేష్, రఘుకుమార్, పి.శేఖర్ పాల్గొన్నారు.

రథశాల పైకప్పు నిర్మాణ పనులు ప్రారంభం

దోమకొండ: మండల కేంద్రంలోని శివరాంమందిర్ ఆలయంలో రథశాల పైకప్పు గత వర్షాలకు కూలిపోయింది. ధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తిరిగి పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండ శ్రీనివాస్, కమిటీ డైరెక్టర్‌లు భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. గ్రామానికి చెందిన దాతల సహకారంతో పనులను ప్రారంభించినట్లు వారు తెలిపారు. గ్రామ పెద్దలు పున్న రాములు, పున్న లక్ష్మన్, పురుషోత్తం ఉన్నారు.

మొక్కలు నాటడానికి స్థలాలను గుర్తించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రఘురాం

రాజంపేట : వనమహోత్సవంలో భాగంగా మండలవ్యాప్తంగా మొక్కలు నాటడానికి స్థలాలను గుర్తించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎంపీడీవో రఘురాం సూచించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా చేపట్టేలా చూడాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీవో అన్నపూర్ణ, ఎంఈవో పూర్ణచందర్‌రావు, టీఏ భాస్కర్, రాజులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘానికి రేకులు వితరణ



బీబీపేట: మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం అధ్వర్యంలో నిర్మించుకుంటున్న ఫంక్షన్ హాలుకు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి బుధవారం రేకులను వితరణ చేశారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అందజేసినట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రవీణ్, సంతోష్‌గౌడ్, పోసు శివ, రంజిత్‌గౌడ్, దేవరాజుగౌడ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్ల బాలుడి కిడ్నాప్.. మూడు గంటల్లో ఛేదన

- దంపతుల అరెస్ట్



సీసీ ఫుటేజీలో రికార్డయిన దృశ్యాలు



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న ఏఎస్పీ చైతన్య రెడ్డి

కామారెడ్డి క్రైం: రెండేళ్ల బాలుడి కిడ్నాప్ కేసును కామారెడ్డి పోలీసులు మూడు గంటల్లోనే ఛేదించారు. పడుకున్న చోటు నుంచి బాలుడిని కిడ్నాప్ చేసిన దంపతులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ చైతన్య రెడ్డి వివరాలు వెల్లడించారు. భిక్కనూర్ మండలం గుర్జకుంట గ్రామానికి చెందిన మక్కాల లక్ష్మి, నర్సింలుకు కుమార్తె, కుమారుడు హర్షిత్ (2) ఉన్నారు. కొంతకాలంగా కామారెడ్డిలో భిక్షాటన చేస్తూ సిరిసిల్ల రోడ్డు ప్రాంతంలోని దుకాణాల ఎదుట నిద్రిస్తుంటారు. మంగళవారం రాత్రి ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ఎదుట తమ పిల్లలతో కలిసి నిద్రించారు. ఉదయం లేచి చూడగా హర్షిత్ కనిపించలేదు. చుట్టపక్కల గాలించినా దొరకలేదు. బాలుడిని కిడ్నాప్ చేశారని గ్రహించి పట్టణ పోలీసులను ఆశ్రయించారు. అప్రమత్తమైన పోలీసులు బాలుడి ఆచూకీ కోసం 3 బృందాలను ఏర్పాటు చేసి విచారణ ప్రారంభించారు. ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించగా బాలుడిని ఓ మగ వ్యక్తి, ఓ మహిళ కలిసి ఎత్తుకెళుతున్నట్లు గుర్తించారు. అన్ని కోణాల్లో విచారణ జరుపగా వారిని దోమకొండకు చెందిన పల్లపు రాజు, అతని భార్య శారదగా నిర్ధారించారు. నిందితులు సైతం పట్టణంలో భిక్షాటన చేస్తూ ఉంటారని తేలింది. దీంతో పట్టణంలో గాలింపు చర్యలు చేపట్టి కామారెడ్డి రైల్వేస్టేషన్ వద్ద బాలుడితో కలిసి భిక్షాటన చేసుండగా పట్టుకున్నారు. హర్షిత్‌ను తల్లిదండ్రులకు అప్పగించి నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సై శ్రీరాం, కానిస్టేబుళ్లు విశ్వనాథ్, విజయ్, రాజు, నరేశ్, రవి, అశ్విన్‌ను అభినందించారు.

సిగరెట్ల వాహనం పట్టివేత

ఖలీల్‌వాడి: జీఎస్టీ లేకుండా తరలిస్తున్న సిగరెట్ల వాహనాన్ని పట్టుకున్నట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. మంగళవారం రాత్రి మహారాష్ట్ర నుంచి నిజామాబాద్‌కు సిగరెట్ల బాక్స్‌లను వాహనంలో తరలిస్తుండగా పట్టుకొని విచారించారు. జీఎస్టీ వివరాలు లేకపోవడంతో వాణిజ్య పన్నుల అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

సీఐ పేరిట వసూళ్లు!

- ఆర్మూర్ సబ్ డివిజన్‌లో హోంగార్డు నిర్వాకం

ఖలీల్‌వాడి: ఆర్మూర్ సబ్ డివిజన్ పరిధిలోని ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పేరు చెప్పి హోంగార్డు వసూళ్ల దందాకు తెరలేపారు. తన ఇంటికి అవసరమైన సిలిండర్‌తోపాటు ఇతర వస్తువులను సీఐ పంపమన్నారని చెప్పడంతో సదరు దుకాణాలకు చెందిన వారు మిన్నకుండిపోయారు. ఇదిలా ఉండగా సీఐ వద్ద వివిధ పనుల కోసం వచ్చే వారితోపాటు పంచాయితీలకు వచ్చే వారి నుంచి రూ. 2 వేల నుంచి రూ. 5 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. సీఐ కార్యాలయంలో అన్నీతానై వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

భీమ్‌గల్ సర్కిల్‌లో కానిస్టేబుల్..

భీమ్‌గల్ సర్కిల్ పరిధిలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో ఇంటెలిజెన్స్‌లో పనిచేసే కానిస్టేబుల్.. భార్యాభర్తల పంచాయితీలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఆ స్టేషన్ ఎస్సై కౌన్సెలింగ్ ఇస్తున్న సమయంలో ఇంటెలిజెన్స్‌కు చెందిన కానిస్టేబుల్ అక్కడ ప్రత్యక్షం అయ్యాడు. దీంతో ఇక్కడికి ఎందుకు వచ్చావని కానిస్టేబుల్‌ను ఎస్సై ప్రశ్నించినట్లు తెలిసింది. ఇదే కాకుండా సదరు పోలీస్‌స్టేషన్‌లో కొన్నేళ్లుగా పనిచేస్తున్న రైటర్లు సైతం ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు ప్రచారంలో ఉంది.